# నేడు వాహనాల వేలంపాట..

## ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీనివాస్‌గౌడ్




**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలో గల ఎక్సైజ్ కార్యాలయం వద్ద గురువారం వాహనాల వేలం పాట నిర్వహింపబడుతుందని బుధవారం విలేకరుల ప్రకటన చేశారు.
ఆసక్తి గల వారు వచ్చి వివిధ కేసులలో పట్టుబడిన ఏడు వాహనాలకు వేలం నిర్వహింపబడుతుందని అన్నారు.ఆసక్తి గల వ్యక్తులు ఉదయం పది గంటలకు వచ్చి వేలం పాటకు హాజరుకావాలని ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌గౌడ్ కోరారుకోరారు.

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి



# కేంద్ర ప్రభుత్వ పథకాలు
# సమర్ధవంతంగా అమలు



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రజలకు సమర్ధవంతంగా అందించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలనీ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంఓ నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కొ ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశా) సమావేశానికి ఎంపీ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ,గ్రామీణాభివృద్ధికి,పేద ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని,అవి పూర్తిస్థాయిలో పారదర్శకంగా అమలు చేయాలనీ స్పష్టం చేశారు.ఆర్టికల్ 275(1),సిసిడిపి (కంప్రహెన్సివ్ కన్జర్వేషన్ అండ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్),ఎంపిసి (మిషన్ ఫర్ ప్రొటీన్ చెయిన్)వంటి పథకాల కింద జిల్లాకు వచ్చిన నిధులను సద్వినియోగం చేయాలని ఆదేశించారు.జాతీయ ఉపాధి హామీ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు జారీ చేయాలన్నారు.ప్రతి కూలికి వంద రోజుల పనిదినాలు కల్పించాలని అన్నారు.ఉపాధి హామీ పథకానికి అనుసంధానంగా జిల్లాలో చేపట్టిన రోడ్లు,గ్రామపంచాయతీ కార్యాలయాలు,అంగన్వాడీ కేంద్రాలు,డ్రైనేజీ కాలువల నిర్మాణాలు,అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించాలని పనులు వేగంగా పూర్తిచేయాలనీ స్పష్టం చేశారు.అన్ని ఇంజినీరింగ్ శాఖలు,ఇతర సంబంధిత శాఖలతో సమన్వయంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.అధికారులంతా ప్రతి పనిని స్వయంగా తనిఖీ చేసి,పనులన్నింటినీ పారదర్శకంగా,నాణ్యతతో పూర్తిచేయాలని,అభివృద్ధి కార్యక్రమాలు అమలుకు ప్రణాళికాబద్ధంగా సమగ్రంగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.ప్రధానమంత్రి అమృత్ 2.0 పీఎం కిసాన్ సమ్మాన్ యోజన,పీఎం శ్రీ పథకాలకు గుణాత్మకంగా అమలు చేయాలన్నారు.పట్టణ ప్రాంతాలకు త్రాగునీటి సరఫరా కోసం చేపట్టితన నీటతి ట్యాంకుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రదానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన్(పిఎం కిసాన్) పథకానికి జిల్లాలో అర్హత కలిగిన రైతులందరికీ తప్పనిసరిగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, పథకానికి అర్హత కలిగిన ప్రతి రైతుకు లబ్ధి అందేలా వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని,ఆదేశించారు. అలాగే రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువుల కొరత తలెత్తకూడదని, వ్యవసాయ శాఖ సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాశాఖలో పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు,అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని, విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల రుణాలు అర్హులైన ప్రతి ఒక్కరికి సమర్ధవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, విద్య, వైద్య, గిరిజన, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ, మున్సిపల్, సంక్షేమ తదితర శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు,అలాగే ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ పథకాల పురోగతిపై శాఖల వారీగా పథకాలు ఎలా అమలవుతున్నాయో సమీక్షించి, అధికారులకు ఎంపీ అవసరమైన సూచనలు చేశారు.అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు.ఈ సమావేశంలో శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి(నిర్మల్), పవార్ రామారావు పటేల్(ముధోల్), వెడ్మా బొజ్జు పటేల్(ఖానాపూర్), అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారలు ఆర్డీవోలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ భూములకు
# దారి సమస్య.. కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామస్తులు తమ వ్యవసాయ భూములకు దారి సమస్య పై బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. గ్రామంలోని సర్వే నంబర్ 18/అ, 18/ఆ, 18/ఇ గల తమ వ్యవసాయ భూమిలోకి ప్రవేశించడానికి పక్కనే ఉన్న పెట్రోల్ ఫిలింగ్ స్టేషన్ భూ యజమాని దారి ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని వారు ఫిర్యాదు చేశారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్ ను కలిసి, గత ఆరు నెలలుగా ఈ సమస్యపై పెట్రోల్ బంక్ భూ యజమానిని సంప్రదిస్తున్నా ఎటువంటి స్పందన లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల పెట్రోల్ బంక్ భూ యజమాని దారికి అడ్డంగా గోడ కట్టే ప్రయత్నం చేస్తున్నారని, దీనివల్ల సమీపంలోని రైతులు, గృహ నివాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు.
ఈ విషయమై తగు విచారణ చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కలెక్టర్‌ను అభ్యర్థించారు. వారి వినతికి స్పందించిన కలెక్టర్, తహసీల్దార్ దత్తాత్రిని ఈ విషయంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# జయప్రదమైన దేశవ్యాప్త
# సార్వత్రిక సమ్మె: సిపిఐ

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ సమ్మెకు కమ్యూనిస్టు పార్టీ పూర్తి మద్దతు ఉందని, కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రయివేటీకరణ ఆపాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు డిమాండ్ల సాధన కోసం ఈ సమ్మె అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్ అన్నారు. బుధవారం కార్మిక సంఘాల జేఏసి ఆద్వర్యంలో తలపెట్టిన జాతీయ సమ్మెలో బాగంగా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుప్రతి ముందు నుంచి ర్యాలీగా రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వరకు అక్కడినుండి ధర్నా చౌక్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సమ్మెను చూసైనా కేంద్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలని కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు హైమది, స్వరూప, భారతి, వెంకటేశ్, కవిత, రాజు పాల్గొన్నారు.



# పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** పర్యావరణాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. బుధవారం రోజున స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జమాతే ఇస్లామీ హింద్ చిన్న పిల్లల విభాగం CIO ఆధ్వర్యంలో చేపట్టిన మట్టిలో చేతులు భారతదేశంలో హృదయాలు కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ పర్యావరణం గురించి జమాతే ఇస్లామి హింద్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని, ప్రతి పిల్లవాడు చిన్ననాటి నుండే పర్యావరణం గురించి ఆలోచించే దిశగా జమాతే ఇస్లామీ హింద్ వారు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మహోన్నతమైనదని కొనియాడారు. ఈ సందర్భంగా CIO ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఆయేషా, వసీం, సబిహా, రవీందర్, విజయ్, మొయిన్, సీనియర్ అసిస్టెంట్ సామంత్ ఆసుపత్రి సిబ్బంది మరియు సి ఐ ఓ పిల్లలు, మెంటర్లు మలీహ ఇరం, మహ్మూద, నాజియా,పాల్గొన్నారు.

## పంపుసెట్ పైపులు సర్వీస్ వైర్ ఎత్తుకెళ్లిన దుండగులు

**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోని ఎండి అలీముద్దీన్ వ్యవసాయ బావి వద్ద పంప్‌సెట్‌కు అమర్చిన పైపులు సర్వీస్ వైరుతో పాటు అక్కడ ఉంచిన ప్లాస్టిక్ తట్టలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందించగా బ్లూకోర్ట్స్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నట్లు బాధితుడు అలీముద్దీన్ తెలిపారు. కాగా పైపులు సర్వీస్ వైర్ ఎత్తుకెళ్లడంతో తమకు సుమారు పదిహేను వేల వరకు నష్టం వాటిల్లిందని , అంతేగాక వరి నాటు వేయడం ఆలస్యం అవుతుందని రైతు అలీముద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు.

## సమ్మెలలో పాల్గొన్న ఈజీఎస్ సిబ్బంది

**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండల వ్యాప్తంగా ఎన్ఆర్ఈజీఎస్ లో పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం దేశవ్యాప్తంగా తలపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లకు రద్దు చేయాలని ఎంపీడీఓ కి వినతి పత్రం అందించి సమ్మెకు వెళ్తున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సహకార సంవత్సర వేడుకలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** సహకార సంస్థల వల్ల సభ్యులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఐక్య రాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 2024లో 2025 అంతర్జాతీయ సంవత్సరంగా ప్రకటించింది. ఇందులో భాగంగా పెద్దపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో పెద్దపల్లి బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు మెరుగైన ప్రపంచ నిర్మాణానికి సహకార సంఘాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా స్థితిస్థాపకమైన, సమానమైన, స్థిరమైన సమాజం నిర్మాణంలో సహకార సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో విద్యార్థినులకు నోటు పుస్తకాలు, పెన్నులు అంగజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ నోడల్ అధికారి కల్పన, కాకతీయ సహకార సంస్థ శిక్షకులు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, సహకార కేంద్ర బ్యాంకు మేనేజర్ నితిన్ రావు, సాగర్ రెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మశాలీలు ఐక్యంగా ఉంటే రాజకీయాలలో రాణించొచ్చు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** సుల్తానాబాద్, పద్మశాలి లో ఐక్యంగా ఉంటే రాజకీయాలలో రాణించవచ్చని పెద్దపల్లి జిల్లా పద్మశాలి సంఘం అడక్ కమిటీ చైర్మన్ వలస నీలయ్య అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండలంలోని చిన్న కల్వల బి కె రిసార్ట్ లో పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై జిల్లా జిల్లాలోని అన్ని కమిటీలు ఏకగ్రీవ తీర్మానాలు చేపట్టారు. పదవ తరగతిలో 550 మార్కులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం, రాజకీయాలలో రాణించేందుకు పద్మశాలీలు ఐక్యంగా కృషి చేయాలని అలాగే పెద్దపల్లి జిల్లా పద్మశాలి సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేసేందుకు సన్నహక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు బత్తుల రమేష్, గోదావరిఖని బందారి రాజమల్లు, అంతర్గాం శ్రీకాంత్, పాలకుర్తి కన్నం వెంకటేశం, కమాన్పూర్ కుందారం బాపు, కాల్వ శ్రీరాంపూర్, సబ్బని రాయమల్లు, దేవసాని లక్ష్మీ పతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడెపు సుధాకర్, పెద్ద సంఖ్యలో పద్మశాలి నేతలు పాల్గొన్నారు.

## మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాన్ని ఆపాలి




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రభుత్వ వనరులను పెద్ద మొత్తంలో గుత్తా పెట్టుబడుదారులైన ముఖ్యులు ఆదానీ, అంబానీ వంటి కార్పోరేట్ గ్రూపుల చేతుల్లోకి వెళ్లేందుకు కృషి చేస్తుందని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ విమర్శించారు. కరీంనగర్ బస్టాండ్ వద్ద సార్వత్రిక సమ్మెలో భాగంగా నిరసన వ్యక్తం చేసి వారు మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఒక క్రమ పద్ధతిలో మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తుందని అన్నారు. ఈ విధానాలతో భారతదేశ స్వావలంబనను బలహీన పరుస్తూ ప్రజలకు అత్యవసర సేవలను అందుబాటులో లేకుండా చేస్తుందన్నారు. దేశంలో ఉన్న సంపదను కొద్దిమంది శతకోటీశ్వరుల చేతిలో పెట్టేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వరంగాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రయోజనం చేసే చట్టాలను తొలగించే విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. జాతీయ విద్యావిధానం పేరుతో విద్యారంగంలో కార్పోరేట్ విధానాలను అనుసరించడాన్ని తీవ్రంగా ఖండించారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆసంపల్లి వినయ్ సాగర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి సాగర్, నగర కార్యదర్శి పులిపాక సాయికుమార్, నాయకులు దాసరి కనకేష్, రత్నం సురేష్, సన్నీ తదితరులున్నారు.

## సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మికుల నిరసన




**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండల కేంద్రంలో సార్వత్రిక సమ్మెలో భాగంగా కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ఒక క్రమ పద్ధతిలో మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తుందన్నారు. కార్మికులకు ప్రయోజనం చేసే చట్టాలను తొలగించే విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తూరి మల్లయ్య, గంధసిరి సంపత్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జమకం వెంకన్న, మండల అధ్యక్ష కార్యదర్శులు రావు ఎల్లయ్య, రేణికుంట సారయ్య, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి సదయ్య, హమాలీ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కనకయ్య, ప్రభాకర్, శ్రీనివాస్, నరేష్, కృష్ణమూర్తి, సారయ్య, రాజు, తిరుపతి, వెంకన్న తదితరులున్నారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేయకుంటే, తిరుగుబాటు తప్పదు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** లేబర్ కోడ్స్ రద్దు చేయకుంటే తిరుగుబాటు తప్పదని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అన్నారు. జులై 9 దేశవ్యాప్త సమ్మె లో భాగంగా సుల్తానాబాద్ పెట్రోల్ బంక్ నుండి తెలంగాణ చౌరస్తా మీదుగా తహసిల్దార్ కార్యాలయం వరకు సిఐటియు ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన చేపట్టి న, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,కార్మికులకు నష్టం చేస్తూ, యజమానులకు లాభం చేసే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులందరికీ నెలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని తదితర డిమాండ్స్ తో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని కార్మిక,ఉద్యోగ సంఘాలు పిలుపునివ్వడంతో, సమ్మె నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ ఆపరేటర్స్, గుమస్తాలు, లారీ డ్రైవర్స్, మున్సిపల్ కార్మికులు, అంగన్వాడి టీచర్లు, మహిళా కార్మికులు, సుల్తానాబాద్ మండల కన్వీనర్ తాండ్ర అంజయ్య, రైస్ మిల్ గుమస్తాల సంఘం అధ్యక్షులు మాతంగి రాజమల్లు, లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు, పోగుల తిరుపతి, మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షులు పాక మహేష్, అంగన్వాడి సంఘం అధ్యక్షులు భార్గవి, బండారి స్వామి, రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్, అంగన్వాడి కార్యకర్తలు, మహిళా కార్మిక సంఘం లు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఎఎన్ఎంలు పర్మినెంట్ చేయాలి



**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధి :** కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర్య ఫెడరేషన్లు అసోసియేషన్, ట్రేడ్ యూనియన్ పిలుపులో భాగంగా 2025 జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ వైద్యారోగ్య ఉద్యోగులను (సిఐటీయు) అనుబంధ సంఘం తెలంగాణ స్టేట్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నుండి ఎఎన్ఎంలు సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఎన్ఎంలు మాట్లాడుతూ పని భారం తగ్గించాలని అలాగే హెల్త్ కార్డు, పిఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, స్వరూప, వనజారాణి, స్వప్న, జమున, ఝాన్సీ, మంజుల, చంద్రకళ, జ్యోతి, గంగామణి, భారతి, సుమలత, వనిత, రాజమణి, జ్యోతి పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌కు సన్మానం

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలానికి తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దాసరి రాజమౌళిని సీతారామచంద్ర స్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలె రామారావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్, పరమేశ్, శ్రీనివాస్ రెడ్డిలతో పాటు తదితరులున్నారు.

## పారడైస్ పాఠశాలలో వనమహోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** కొత్తపల్లి మండలం రేకుర్తిలోని స్థానిక పారడైస్ పాఠశాలలో బుధవారం వనమహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమా రెడ్డి మొక్కలు నాటారు. అనంతరం ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరిని ప్రోత్సహించడం కోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలోవసంత, వైస్ ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన పుట్ట మధు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో నిమ్మతి చంద్రయ్య ఇటీవల మరణించగ వారి కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. అలాగే ముత్తారం గ్రామంలో ఇటీవల పాము కాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న అల్లం దేవేందర్ ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన నిమ్మతి చంద్రయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని బుధవారం ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్ఎల్ ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య లు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు అకోజ్ అశోక్ చారి,లక్కం ప్రభాకర్, నిమ్మతి రవీందర్ తో పాటు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టం అమలు కోసం ఆమ్ ఆద్మీ పార్టీ చలో సెక్రటేరియట్..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** తెలంగాణలో విద్యా హక్కు చట్టం (ఆర్‌టిఇ) పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ,ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం జూలై 10న జరగనున్న "చలో సెక్రటేరియట్"ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం రోజు నిర్మల్‌లో ఆవిష్కరించింది.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నుండి ఇప్పటి వరకు విద్యారంగంలో సరైన మార్గదర్శకత్వం కొరవడిందని ఆమ్ ఆద్మీ పార్టీ స్పష్టం చేసింది. ప్రభుత్వం ఈ కీలక సమస్యను పరిష్కరించడంలో విఫలమైతే, తమ నిరసనలను తీవ్రతరం చేస్తుందని,అన్నారు.

# రేవంత్ రెడ్డికి, బండి సంజయ్‌కి ప్రజా సమస్యలపై కనీస పరిజ్ఞానం లేదు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ వీరిద్దరిలో ఏ ఒక్కరికీ ప్రజా సమస్యలపై కనీస పరిజ్ఞానం లేదని, ఉదయం లేస్తే ఉద్యమ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను విమర్శించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని టిఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య విమర్శించారు. బుధవారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడారు. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి, బండి, సంజయ్ కి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హోదా ఆక్సిడెంటల్గా వచ్చాయని ఎద్దేవ చేశారు. ప్రజాపాలన అందిస్తామని ముఖ్యమంత్రి పదవి చేపట్టిన రేవంత్ రెడ్డి పాలన చేత గాక బూతు మాటలకు కేరాఫ్ అడ్రస్ గా మారిపోయాడని అన్నారు. ఎన్నడూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడని, అదే తరహాలో బండి సంజయ్ అక్సిడెంటల్గా కేంద్ర మంత్రి పదవిని దక్కించుకున్నాడని పేర్కొన్నారు. ఆంధ్రపాలకుల మోచేతి నీళ్లు త్రాగే వ్యక్తులు రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారని ఆరోపించారు.పదేండ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపారని కొనియాడారు. తమ పాలనతో జాతీయ స్థాయి గుర్తింపు పొందిన నాయకులు కేటీఆర్, హరీష్ రావు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పని చేస్తున్న ఏ ఒక్క నాయకుడికి ప్రజాసమస్యలపై పట్టింపులేదన్నారు. అటువంటి గొప్ప నాయకుడు కేటీఆర్ పై సీతక్క చేస్తున్న విమర్శలకు ప్రజలు ముగింపు పలుకుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధం వేణు,జిందం చక్రపాణి, న్యాలకొండ రాఘవరెడ్డి, కుంభాల మల్లారెడ్డి,బండ నరసయ్య, ఎదురుగట్ల చంద్ర గౌడ్, మ్యాన రవి, గడ్డం భాస్కర్, కంచర్ల రవి,సాయికిరణ్, ఆఫ్రోజ్, అజ్జు, జోషల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా అదృశ్యం

**ప్రజాపక్షం/మల్యాల :** బయటకి వెల్లిన మహిళా కనబడకుండా పోయిన ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండలం సర్వాపూర్ గ్రామం లో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చందుర్తి మండలం మూడపెల్లి గ్రామానికి చెందిన బైరోజు నర్సయ్య వృత్తి రీత్యా కమ్మరి పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నడు.ఈ నెల 7వ తేదీ రోజున ఉపాధి నిమిత్తం కుటుంబం తో సహా మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలోని బాసోజు రాజేశం వద్ద పనికి కుదిరాడు . మంగళ వారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నరసయ్య చిన్నకూతురు అయిన రమ్య అలియాస్ లావణ్య 27 బయట సైకిల్ తొక్కుకుంటాను అని వెళ్ళి చాలాసేపు అయినా ఇంటికి రాకపోయేసరికి ఆమె గురించి చుట్టుపక్కల ,బంధువుల ఇంట్లో ఎంత వెతికిన పలితం లేక పోవడం తో బుదవారం బైరోజు రమ్య తండ్రి నరసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అర్చకుల సంఘీభావం

**ప్రజాపక్షం/సారంగపూర్:** శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం భద్రాచలం కార్యనిర్వహణాధికారిపై మంగళవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తు, ఇలాంటి దాడులు జరుగకుండా దేవాలయ భూములు అక్రమించుకున్న వారి నుండి భూములను వెనక్కి తీసుకునేలా కఠినమైన చట్టాలు చేయుటకు నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం పెంబట్ల కోనాపూర్ శ్రీ దుబ్బరాజేశ్వర స్వామి దేవస్థాన కార్యనిర్వాహణధికారి, ఉద్యోగస్తులు, అర్చకులు అందరు సంఘీభావం తెలిపారు. ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా కఠినమైన చర్యలుతీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇవో అనూష, అర్చకులు , ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బోనాల మహోత్సవానికి హాజరైన చల్మెడ

**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ పట్టణానికి చెందిన టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ మైసమ్మ తల్లి అమ్మవార్లకు ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ మహోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల మహోత్సవం నిర్వహించడం చాలా శుభప్రదం అని పేర్కొన్నారు. వ్యాపారాలు, కుటుంబాలు మంచిగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నామని తెలిపారు. ఈ వేడుకలో మాజీ సెస్ డైరెక్టర్లు రామతీర్థపు రాజు, గజానంద రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి



విజయ్, సిరిగిరి చందు, నరాల శేఖర్, గోలి మహేష్, జోగిని శంకర్, ముద్రకోల వెంకటేశం, నాయకులు నరాల దేవేందర్, నీలం శేఖర్, కొండ కనకయ్య, కొండ నర్సయ్య, వాసాల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, మల్లేశం, సుంకపాక రాజు, రాకేష్, బియ్యాల ప్రమోద్, డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షులు వాసాల మధుసుదన్, ఉపాధ్యక్షులు వెంకటేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామలలో ఇందిర మహిళ శక్తి సంబరాలు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్, వర్షకొండ, ఇబ్రహీంపట్నం,వేములకుర్తి,తిమ్మపుర్, తిమ్మపుర్ తండ,ఫకీర్ కోండాపుర్,యామపుర్, బర్దిపుర్, ములరాంపుర్, ఎర్దండి, కోమటికోండాపుర్, కేశాపుర్,కోజన్ కోత్తుర్, వర్షకోండ, డబ్బా,అమ్మకపెట్, ఎర్రాపుర్ గ్రామాల్లో29 గ్రామ ఐక్య సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళా సమైక్య భవనాలలో రంగవల్లులను వేసి చక్కటి అలంకరణ చేశారు.

స్త్రీ స్వశక్తి మహిళా సమైక్య మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఏర్పాటు చేసి కేకుకోసి సంబరాలు జరుపుకున్నారు. అనతరం ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు అదేవిధంగా గ్రామంలోని మహిళలు గ్రామ సంఘ అసిస్టెంట్లు, పలు శాఖల అదికారులు,నాయకులు పాల్గొన్నారు.

## నేడు పొలాసలో లక్ష్మీ సరస్వతి హోవనం

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** గురుపౌర్ణమి సందర్భంగా పొలాసలోని లలితమాత ఆలయంలో శ్రీలలితా మూలమంత్ర సహిత లక్ష్మీ సరస్వతి హోవన కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నామని 108 శ్రీ చక్ర సహిత లలితామాత ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప తెలిపారు. ఆలయంలో ప్రతి పౌర్ణమి రోజున హోమం, యజ్ఞ కార్యక్రమాలు న్విహిస్తున్నామని తెలిపారు. శ్రీనంబి వేణుగోపాలచార్య మంగళషాషణంలతో హోవన కార్యక్రమాన్ని తీగుళ్ల విషశర్మ నిర్వహిస్తారని అన్నారు. ఉదయం 9 గంటనుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే హోమంలో భక్తులు పాల్గొనాలని స్వరూప సూచించారు.

## జామ మసీదు అభివృద్ధికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలో ఉన్న జామ మసీద్‌ను బుధవారం సందర్శించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ముస్లిం కమిటీ, మసీద్ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అక్రం, జామ మసీదు అధ్యక్షుడు నవాబ్ ఖాన్ లతో పాటు సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మసీదు పునర్నిర్మాణానికి నిధుల మంజూరుపై వినతిపత్రం అందజేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను ఫోన్‌లో సంప్రదించగా మసీదు పునర్నిర్మాణానికి సంబంధించిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మైనార్టీ శాఖ



మంత్రులతో చర్చించి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకుడు అబ్దుల్ రజాక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్‌కె సాబిర్, ముస్లిం కమిటీ సభ్యులు ఎస్‌డీ షబ్బీర్, మోసిన్, నాసిర్, యూసుఫ్, షరీఫ్, రహూఫ్ ఖాన్, షరీఫ్ బాబా, కైఫ్, సోహెల్, కాంగ్రెస్ ముస్లిం నేతలు పాల్గొన్నారు.

## దుబ్బ రాజన్న స్వామిని దర్శించుకున్న మాజీ మంత్రి వర్యులు జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/సారంగపూర్:** జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలంలోని పెంబట్ల కోనాపూర్ దుబ్బరాజేశ్వరస్వామిని బుధవారం మాజీ మంత్రివర్యులు తాటిపర్తి జీవన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దుబ్బ రాజేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. దుబ్బ రాజేశ్వర స్వామి వారి క్షేత్రం కేవలం సారంగపూర్ మండలానికి పరిమితం కాకుండా యావత్ ఉత్తర తెలంగాణ ప్రాంతానికి చాలా పవిత్రమైన పుణ్యక్షేత్రం ఇటువంటి క్షేత్రానికి నిర్మాణ కార్యక్రమాలు సేవ చేసేటువంటి సభ్యులకు లభించడం వారికో విధంగా పూర్వజన్మ సుప్రితంగా భావించాలన్నారు.

మౌలిక సదుపాయాల కల్పన ప్రధానంగా త్రాగునీటి సౌకర్యం గాని కోనేరు స్థానాల సౌకర్యం కాని వసతి సంబంధించి ముఖ్యంగా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని మరింత సదుపాయాలు మెరుగుపరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం పరంగా ఏ విధమైన సౌకర్యాలు నిధులు సమకూర్చటానికి ప్రభుత్వం సిద్దంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇవో వి.అనూష, ఎంపీడీవో చౌడారపు గంగాదర్, మాజీ బీర్‌పూర్ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ సర్పంచ్‌లు బొడ్డుపెల్లి రాజన్న, ఆకుల జెమునరాజిరెడ్డి, మాజీ ఎంపీటిసి మాలెపు విమలసుధాకర్, ధర్మపురి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామడుగు రవి, వ్యవస్థాపక ధర్మకర్త శంకరయ్య, ఆలయ నూతన ధర్మకర్తలు కొండ్ర రామచంద్రరెడ్డి, శ్రీనివాస్, కిష్టయ్య, శంకర్, కాంగ్రెస్ నాయకులు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం /మల్లాపూర్:** మండల కేంద్రంలోనూతనంగా ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో మండల టిఆర్ఎస్ నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ అన్నారు.

సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత, జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు లు హాజరవుతున్నారనీ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డీలర్ మల్లయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు లింగస్వామి, నాయకులు శరత్ గౌడ్ శంకర్ బిక్షపతి సతీష్ ప్రేమ్ గంగాధర్ రాజేశ్వర్ లక్పతి లక్ష్మ ణ్ బిట్టు అంజయ్యతదితరున్నారు

## జగిత్యాల విద్యార్థికి కేయు స్నాతకోత్సవంలో 4 గోల్డ్ మెడల్స్

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల తారకరామనగర్ కి చెందిన నేరెళ్ల సింధుకృష్ణ కాకతీయ యూనివర్సిటీ నుండి పీజి ఎంఏ ఎకనామిక్స్ విభాగంలో 4 గోల్డ్ మెడల్స్ సాధించింది. కాకతీయ యూనివర్సిటీలో 2019 లో పీజీ పూర్తి చేసిన సింధుకృష్ణ యూనివర్సిటీ టాపర్ గా నిలిచింది. దానితో పాటు ఎకనామిక్స్ విభాగంలో 3 వేరువేరు అంశాలలో తను చేసిన పరిశోధనకు గాను 3 గోల్డ్ మెడల్స్ సాధించింది.



తమ కూతురు గోల్డ్ మెడల్స్ సాధించడం పట్ల సింధు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు. నిన్న జరిగిన కాకతీయ యూనివర్సిటీ 23 వ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఐఐసిటి డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. సింధు కృష్ణను ధర్మశాస్త్రా అకాడెమి డైరెక్టర్ స్వరాజ్ కృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

## సిఏ ఫలితాల్లో సత్తా చాటిన తాటి పెల్లి యువకుడు

**ప్రజాపక్షం/మల్యాల:** చార్టెర్డ్ అకౌంటెంట్(CA) ఫైనల్ పరీక్షల రిజల్ట్స్ జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపెల్లి గ్రామానికీ చెందిన ఏనుగుల మనోజ్ గ్రూప్ 1 కేటగిరీ లో పాసయ్యాడు.మే నెలలో జరిగిన సీఏ ఫైనల్ పరీక్షల ఫలితాలను ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ICAI) ఈ నెల 6 తేది ఆదివారం విడుదల చేసింది. మనోజ్ తల్లిదండ్రులు



మల్లేష్ , గంగలక్ష్మి ఈ విషయాన్ని విని చాలా సంతోషం వ్యక్తంచేశారు.మనోజ్ తండ్రి ఏనుగుల మల్లేష్ జీవనోపాధి కోసం దుబాయ్ లో పని చేస్తున్నాడు. తమ కొడుకు ఎంతో కష్టపడి ఈ పరీక్షలు పాస్ అయ్యాడు అని తెలిపారు.తాటి పెల్లి గ్రామంలో చార్టర్డ్ అకౌంటెంట్ పాస్ అయిన మొట్ట మొదటి వ్యక్తి తమ కొడుకేనని మురిసిపోయారు.ఈ సందర్భంగా గ్రామస్తులు కూడా సంతోషం వ్యక్తం చేస్తూ గ్రామ యువత మనోజ్ ని ఆదర్శంగా తీసుకుని కష్టపడి చదువుకొని మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని మనోజ్ కి అభినందనలు తెలియజేసారు.

## పోచమ్మ తల్లికి బోనాలు

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** జగిత్యాల పట్టణంలోని కటికెవాడలోని గౌడ కులస్తులు లోకమాత పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని డప్పుచప్పుళ్ల తో అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లికి బోనం సమర్పించి ఓడిబియ్యం సమర్పించారు. చిన్నా, పెద్ద అందరు అమ్మవారికి భక్తితో మొక్కులు చెల్లించుకున్నారు.

# ఎంపిటిసి స్థానం తొలగింపుకు గ్రామస్థుల నిరసన

**పెంచికల్ పేట్ ప్రజాపక్షం / పెంచికల్ పేట్:** ఎంపిటిసి స్థానం పేరును ఎల్లూరుగా మార్చిన చర్యను వెంటనే వెనక్కి తీసుకోవాలని, పాత పేరు కొనసాగించకపోతే భవిష్యత్తులో ఎన్నికలను బహిష్కరిస్తామని పెంచికల్ పేట్ గ్రామస్థులు హెచ్చరించారు. బుధవారం పెంచికల్ పేట్ మండలంలోని పెంచికల్ పేట్ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1995 నుండి ఎంపిటిసి స్థానంగా కొనసాగుతున్న మండల కేంద్రం పేరు, 20 దశాబ్దాల చరిత్ర కలిగిన పెంచికల్ పేట్ స్థానాన్ని ఎల్లూర్ ఎంపిటిసిగా మారుస్తూ తీసుకున్న నిర్ణయం అన్యాయమని పేర్కొన్నారు. పెంచికల్ పేట్ ఎంపిటిసి స్థానం పేరును యథావిధిగా కొనసాగించాలని, లేకపోతే పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించకుండా బహిష్కరణకు గ్రామస్తులందరూ సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎంపిడిఓకి వినతిపత్రం అందజేశారని తెలిపారు.



## లోతైన గుంతలతో ప్రమాదాల ప్రయాణం



**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని ఇందాని, తేజపూర్, నవేగూడా, కిరిడీ ఘాట్, జనగాం గ్రామాలను మహారాష్ట్రకు అనుసంధానించే ప్రధాన రహదారి ప్రస్తుతం వర్షాల కారణంగా పూర్తిగా గుంతలతో నిండిపోయి ప్రయాణికులకు ప్రాణాలకు ప్రమాదకరంగా మారింది. వర్షపు నీటితో రహదారిపై గుంతలు కనిపించకుండా పోవడంతో వాహనదారులు ప్రతిక్షణం ప్రమాద భయంతో ముందుకెళ్తున్నారు. ప్రతి వాహనం ఒక్కొక్క అడుగు వేయాలంటే శ్వాస ఆపుతూ వెళ్లాల్సిన పరిస్థితి. ఇటువంటి దారులపై ప్రజలు ప్రయాణించడం వలన ప్రాణాపాయం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లేదంటే రోడ్డుపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్థానిక ప్రజలు హెచ్చరించారు.

## సింగరేణిలో సార్వత్రిక సమ్మె విజయవంతం

**ప్రజాపక్షం / కాసిపేట :** బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గాలను బజారున పెట్టిందని, మోడీకి గుణపాఠం చెప్పాలనే లక్ష్యంతో సింగరేణిలో సమ్మెను విజయవంతం చేశామని జెఎసి నేతలు పేర్కొన్నారు. కాసిపేట గనుల్లో జెఎసి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే కుట్రను అడ్డుకోవాలంటే ఉద్యమం మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, టిబిజికెఎస్, సిఐటియు, నేతలు, కార్మికులు భారీగా పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్:** ప్రభుత్వ విద్యా సంస్థలు, వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. బుధవారం, ఆసిఫాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా మాధ్యమిక అధికారి కళ్యాణి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, పంచాయతీరాజ్ ఇంజనీర్ కృష్ణ, గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. ఇంజనీరింగ్ అధికారులు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశమై, పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాల్లో అదనపు గదులు, త్రాగునీరు, మూత్రశాలలు, విద్యుదీకరణ, సిసి కెమెరాలు, పెయింటింగ్ పనులపై ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. ఆస్పిరేషనల్ బ్లాక్ తిర్యాణి మండలంలో వీటిని ప్రాధాన్యతతో చేపట్టాలని, ప్రారంభించిన పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి, పలు శాఖల ఇంజినీర్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/మందమర్రి :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, బాధ్యతగా వాహనాలు నడపాలని ఎస్ఐ ఎస్. రాజశేఖర్ పటేల్ అన్నారు. బుధవారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంపై స్పందిస్తూ ఎస్ఐ వివరాలు వెల్లడించారు. తాండూరు మండలం రేచిని గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గోమాస తిరుపతి తన స్నేహితుడు గువ్వల కిషోర్‌తో కలిసి ప్రయాణికుల కిరాయినిమిత్తం 8వ తేదీ రాత్రి మంచిర్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా, రాత్రి 11:30 గంటల సమయంలో మందమర్రి మండలం అందుగులపేట శివారులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో వారి ఆటోను వెనక నుండి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోమాస తిరుపతి, గువ్వల కిషోర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని తొలుత మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి, అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని కెల్విన్ ఆసుపత్రికి తరలించారు. అయితే గోమాస తిరుపతి చికిత్స పొందుతూ 9వ తేదీ ఉదయం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని తమ్ముడు గోమాస రాజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్ఐ ఎస్. రాజశేఖర్ పటేల్ తెలిపారు.

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**ప్రజాపక్షం / కెరిమేరి:** కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, సిఐటియు మండల కన్వీనర్ ఆనంద్ రావు డిమాండ్ చేశారు. బుధవారం కెరమెరిలో సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. రైతు పంటకు గిట్టుబాటు ధరకు చట్టం, ఆశా, మల్టీపర్పస్, మధ్యాహ్న భోజన కార్మికులకు వేతన భద్రత కల్పించాలని, జీఓ 49 ను రద్దు చేసి పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని తెలిపారు.

## సింగరేణిలో సమ్మె సంపూర్ణంగా నిర్వహణ



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని, అవి రద్దవకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. బుధవారం, సింగరేణి సంస్థలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా జెఎసి నాయకులు ఏరియాలోని గనులను సందర్శించి కార్మికులను కలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. కేంద్రం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనగా సింగరేణి మరియు కాంట్రాక్ట్ కార్మికులంతా స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారని వెల్లడించారు. ఒక్క బిఎంఎస్ మినహా అన్ని కార్మిక సంఘాలు ఈ సమ్మె విజయవంతానికి సహకరించాయని తెలిపారు. కార్మిక వర్గం పూర్తిస్థాయిలో ఆగ్రహానికి గురికాకముందే కేంద్రం తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, అలా జరగకపోతే భవిష్యత్తులో పోరాటం మరింత ఉధృతంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరభద్రయ్య, సమ్మయ్య, బాజీ సైదా, కిషన్ రావు, కొమురయ్య, శంకర్రావు, శ్యామ్, రవీందర్ రెడ్డి, స్వామి, భూపాల్, బాలాజీ, చంద్రశేఖర్, సురేందర్ రెడ్డి, రమేష్, సత్తయ్య, కార్మికులు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి రోడ్డుపై చిరు వ్యాపారులకు నోటీసులు

**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండలం ఆర్ అండ్ బి రోడ్డుపై దుకాణాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులకు గ్రామ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. గత పది రోజుల క్రితం నోటీసులు ఇచ్చిన అధికారులు, రోడ్డు విస్తరణ లేదా ఆక్రమణల తొలగింపు భాగంగా ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించారు. బుధవారం, ఆర్ అండ్ బి శాఖకు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ (ఎఇ) క్రాంతికుమార్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఇతర అధికారులు రోడ్డు కొలతలను చేపట్టారు. ఈ కొలతలు రోడ్డు సరిహద్దులు, ఆక్రమించిన ప్రాంతాలను గుర్తించడానికి ఉద్దేశించబడ్డాయి. ఈ పరిణామం స్థానిక చిరు వ్యాపారులలో కొంత ఆందోళనను కలిగించింది. రోడ్డు విస్తరణ లేదా ఆక్రమణల తొలగింపు చర్యల వల్ల తమ జీవనోపాధి పై ఎలాంటి ప్రభావం పడుతుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది వేచి చూడాలి.

## నిర్మల్ సర్కిల్‌లో 7 కొత్త సబ్‌స్టేషన్లు మంజూరు

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** వినియోదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో, నిర్మల్ సర్కిల్ పరిధిలో కొత్తగా ఏడు సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని,వాటి పనులు వేగంగా జరుగుతున్నాయని నిర్మల్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ సలియా నాయక్ బుధవారం రోజు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. డోడెర్నా,రాంసింగ్ తండా ,సోఫీనగర్, మహాలింగి, కోలూర్, పాల్సి, దత్తోజిపేట్ గ్రామాలలో ఈ కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు అవుతున్నాయి. డిమాండ్ కు అనుగుణంగా అవసరం ఉన్న మేరకు కొత్త సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామని, భవిష్యత్తులో ఎటువంటి లోవోల్టేజ్ సమస్య ఉండదని సలియా నాయక్ స్పష్టం చేశారు.ఈ సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ పంపిణీ మరింత సమర్థవంతంగా మెరుగుపడుతుందని ఆయన వివరించారు. మౌలిక వసతుల అభివృద్ధికి అనుగుణంగా వస్తున్న ఈ కొత్త సబ్‌స్టేషన్ల రాకతో రైతులు, గృహ, వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయని తెలిపారు.ఈ చర్యలు నిర్మల్ సర్కిల్‌లోని వినియోగదారులకు నాణ్యమైన,నిరంతరాయ విద్యుత్ సరఫరాను అందించడంలో గణనీయమైన పురోగతిని సూచిస్తాయి.

## కార్మికుల హక్కులు కాలరాసే లేబర్ కోడ్ లను రద్దుచేయాలి..




**ప్రజాపక్షం/బైంసా :** కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలనీ తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.హరిత,ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టియుసిఐ) రాష్ట్ర నాయకులు రామ్ లక్ష్మ ణ్ డిమాండ్ చేసారు.బైంసాలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఐబీ నుండి టిప్పు సుల్తాన్ చౌక్ వరకు ర్యాలీ చేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన దేశ ప్రదాన మంత్రి నరేంద్ర మోడీ తాను అధికారంలో వస్తే దేశంలో ఉన్న కూటిర పరిశ్రమలను కాపాడుతానని ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి తాను అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అయిపోతున్న నేటి వరకు తానిచ్చిన హామీ అమలు చేయలేదని విమర్శించారు.కనీస వేతనం 26 వేల ఇవ్వాలని,స్వదేశీ జపం చేసిన మోడీ ఆదాని,అంబానీ విదేశీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి భారతదేశ కార్మిక వర్గం పైన ఉరితాళ్లు బిగిస్తున్నరని,వారిని కట్టు బానిసలు గా తయారు చేస్తున్నారని ఆరోపించారు.బీడీ పరిశ్రమపై విధించిన జీఎస్టీ ఎత్తివేయాలని,రాజీనామా చేసిన కార్మికులందరికీ కనీస పెన్షన్ 9 వేలు ఇవ్వాలని,నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని,సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం బీడీ కార్మికులు అందరికీ ఎలాంటి షరతులు లేకుండా చేయూత పథకం కింద 4 వేల రూపాయల జీవన భృతి ఇవ్వాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టి.యు.సి.ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ముత్యం, పెయింట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు లతీఫ్, బీ డీ కార్మిక నాయకులు దేవిదాస్, సాయిలు, నాగనాథ్, సాయన్న , రాధ,సీత ,అలీమ్, అక్తర్ ముత్తవ్వ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సారంగాపూర్ లో సీఐటీయూ ఆద్వర్యంలో అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు బుధవారం ఆందోళనకు దిగారు.ర్యాలీగా వచ్చి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.కేంద్రం 4 లేబర్ కోడ్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు,ఆశా వర్కర్లు,ఎన్ఎంఆర్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/తిర్యాణి:** నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్ డిమాండ్ చేశారు. బుధవారం తిర్యాని మండల కేంద్రంలో కార్మికులు ర్యాలీ నిర్వహించి, కొమరం భీం విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీకానంద్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కుదింపుతోందని, కోడ్‌లు అమలైతే కార్మిక సంఘాల ఏర్పాటే కష్టమవుతుంది. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సుద్దాల తిరుపతి, గుండం శంకర్, పార్వతి, భీంబాయి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

**ప్రజాపక్షం/దండేపల్లి:** మండలంలోని వందూర్ గూడ గ్రామానికి చెందిన కోవ మహేందర్ (19) అనే యువకుడు పురుగుల మందు తాగిన ఘటనలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. దండేపల్లి ఎస్ఐ తహసీనొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం... మహేందర్ కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడని, పని చేసి వచ్చిన డబ్బులతో తరచూ మద్యం సేవించేవాడని తెలిపారు. మద్యం సేవనంతో అతడికి కడుపునొప్పి తరచూ ఏర్పడుతోందని, ఈ నెల 5న కడుపునొప్పి రావడంతో మందుల కోసం దండేపల్లికి వెళ్లాడని, అయితే నొప్పి తీవ్రంగా ఉండటంతో భరించలేక గుర్తు తెలియని పురుగుల మందు తాగిన మహేందర్, తన స్నేహితుడికి ఫోన్ చేసి ఈ విషయం చెప్పినట్లు తెలిపారు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, అక్కడి నుంచి పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. అయితే చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మహేందర్ మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుని అన్న కోవ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తహసీనొద్దీన్ తెలిపారు.

## పులి దాడిలో లేగ దూడ మృతి..

**ప్రజాపక్షం/కాసిపేట:** కాసిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు బుద్దే రాజలింగు యొక్క లేగ దూడ ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని మల్కెపల్లి బీటు వద్ద మంగళవారం పులి దాడిలో మృతి చెందింది. ఈ ఘటనపై అటవీశాఖ తక్షణమే స్పందించింది. బుధవారం ఉదయం బెల్లంపల్లి అటవీశాఖ కార్యాలయంలో రైతుకు రూ.20 వేల నష్టపరిహారాన్ని అటవీ క్షేత్ర అధికారి సిహెచ్. పూర్ణచందర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరిగిన వెంటనే సమాచారం అందించగలిగితే సకాలంలో స్పందించి నష్టపరిహారం అందిస్తాం. పంట పొలాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలని, పశువుల కాపరులు అడవిలోకి వెళ్ళరాదని, అటవీ జంతువులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ అధికారి బి. ప్రవీణ్ నాయక్, ఎఫ్‌బిఒ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

**ప్రజాపక్ష/ఖానాపూర్ :** కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సార్వత్రికసమ్మెలో భాగంగా ఖానపూర్ మండలంలో వివిధ రంగాలకు చెందిన కార్మికులు నిరసన వ్యక్తం చేసి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని,గతంలో ఉన్నటువంటి 29 కార్మిక చట్టాలను యధాతధంగా ఉంచి,పని చేసే చోట 10 గంటల పెంపుతో కార్మికులపై అదనపు భారం పడుతుందని పనిగంటల సమయం తగ్గించాలని,దశాబ్దాల తరబడి పోరాడుతున్నా కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకుండ నిర్లక్ష్యం చేస్తూ పెట్టుబడుదారులకు, కార్పొరేటర్ శక్తులకు కార్పెట్ పరుస్తు వల వాటికి మేలు చేసే విధంగా కార్మికులను శ్రమదోపిడి చేస్తున్నారని అన్నారు.కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకొని జీవో నెంబర్ 282 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు గంగామణి, ఆశ వర్కర్లు, రజిత, గంగామణి, కమల మున్సిపల్ కార్మికుల కన్వీనర్ సురేష్, కో కన్వీనర్ త్రివేణి, మండల కమిటీ సభ్యులు రమేష్, గంగాధర్, విజయ్, శేఖర్, నాగరాజు జావేద్, స్వప్న, లక్ష్మి , ఆశ వర్కర్లు, మున్సిపాలిటీ సిబ్బంది,అంగన్వాడీ ఆయాలు,మధ్యాహ్న భోజన కార్మికులు,పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల జాప్యంపై లబ్ధిదారుల నిరసన

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఎడపల్లి మండలంలోని పైలెట్ గ్రామమైన జైతాపూర్‌లో ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లులు రావడం లేదని పలువురు లబ్ధిదారులు బుధవారం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న జైతాపూర్ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు కలెక్టర్‌ను కలిసి బిల్లుల మంజూరులో జరుగుతున్న జాప్యంపై వివరించారు. గ్రామంలో కొంతమందికి బిల్లులు వచ్చాయని, అయితే మరో 20మందికి ఇంకా రాలేదని, ఈ విషయమై సంబంధిత అధికారులను పలుమార్లు ప్రశ్నించిన పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ జైతాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ఫోటోలను నిబంధనల ప్రకారం తీయకపోవడం, సరిగా అప్‌లోడ్ చేయకపోవడం వల్ల సాంకేతిక సమస్య ఏర్పడి బిల్లులు రావడంలో ఆలస్యం అయిందని వివరించారు. బిల్లులు రాని లబ్ధిదారుల ఇండ్ల ఫోటోలను సరిగా తీసి అప్‌లోడ్ చేస్తే బిల్లులు వస్తాయని, ఇందుకోసం ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లబ్ధిదారులకు హామీనిచ్చారు.



**గ్రామ కార్యదర్శిని నిలదీసిన లబ్ధిదారులు...**

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇండ్ల ఫోటోలు సరిగా తీయకపోవడం వల్లే బిల్లులు ఆలస్యమయ్యాయని జిల్లా కలెక్టర్ తెల్పడంతో ఆగ్రహించిన పలువురు లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఉన్న జైతాపూర్ గ్రామ కార్యదర్శి నగేష్ ను నిలదీశారు. తమ ఇండ్ల ఫోటోలు సరిగా తీయకపోవడం వల్లే తమకు బిల్లులు రావడం లేదని, తమకు బిల్లు రాకపోతే అందుకు బాధ్యులు ఎవరంటూ లబ్ధిదారులు ప్రశ్నించారు. దీనిపై స్పందించిన గ్రామ కార్యదర్శి నగేష్, గ్రామంలో అందరి ఇండ్ల ఫోటోలు తీసినట్టే తమ ఇండ్ల ఫోటోలు కూడా తీసి పంపానని, బిల్లులురాకపోతే తనేం చేయాలని అసహనం వ్యక్తం చేశారు. ఫోటోలు సరిగా లేవని తనపై అధికారులు తకు చెప్పి తిరిగి మరో ఫోటో తీసి పంపాలని ఆదేశిస్తే తిరిగి మరో ఫోటో తీసి పంపుతానని కార్యదర్శి నగేష్ తెలిపారు.

## మంచిర్యాల హమాలీవాడలో బోనాల జాతర

**ప్రజాపక్షం/మంచిర్యాల :** హమాలివాడలోని కట్ట పోచమ్మ ఆలయంలో బోనాల జాతర బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. హనుమాన్ సాయిబాబా ఆలయం నుంచి ప్రత్యేక పూజల అనంతరం హైదరాబాద్ నుంచి విచ్చేసిన జోగిని నిషా క్రాంతి పూనకాలతో బోనాల ఊరేగింపు ప్రారంభమైంది. నల్ల కోటమ్మ, లక్ష్మయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతరలో, బంగారు బోనం నల్ల శంకర్ నివాస గృహం వరకు కనుల పండుగగా సాగింది. అక్కడ జోగిని నిషా క్రాంతి బంగారు బోనాన్ని అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం డప్పుల ధ్వనులు, బాణాసంచా మధ్య, పోతరాజుల విన్యాసాలతో బంగారు బోనాన్ని తలపై ఎత్తుకొని నిషా క్రాంతి నృత్యాలు చేస్తూ మహిళలు తీసుకొచ్చిన బోనాలతో కలిసి కట్ట పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి తొలి బోనం సమర్పించగా, అనంతరం స్థానిక మహిళలు



తీసుకొచ్చిన బోనాలను ఆలయంలో సమర్పించారు. బోనాల జాతరకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అమ్మవారికి బోనం సమర్పించి పూజల్లో పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు బోనాల జాతర ఘనంగా కొనసాగింది. అనంతరం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నల్ల శంకర్ నివాస గృహంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మార్చుకోవాలి

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాపిత సమ్మెలో భాగంగా బుధవారం ఆసిఫాబాద్‌లో ఏఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌక్ వద్ద మహా ధర్నా చేపట్టారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెఏసి నాయకులు ఉపేందర్, రాజేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను హరించివేయడంతో పాటు కార్మిక సంఘాలను సైతం అణచివేసే విధంగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, చిరంజీవి, సుధాకర్, సారిక, దింకర్, నాయకులు కార్తీక, దివాకర్, కొమిరక్కతో పాటు పలువురు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటిబాట పట్టిన విద్యార్థులు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీదారులు బుధవారం ఒక్కరోజు సమ్మె చేపట్టడంతో మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పంపిణీ నిలిచిపోయింది. దీంతో మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించక పోవడంతో విద్యార్థులు మధ్యాహ్ననికే ఇంటి బాట పట్టారు. భోజనం చేసిన అనంతరం పాఠశాలకు వెళ్ళగా బీసీ వసతిగృహంలో అప్పటికప్పుడు మధ్యాహ్నం భోజనం తయారు చేసే పనిలో పడ్డారు. కాగా విద్యార్థులకు భోజనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏవీ చేయలేదని తిరుపతిరెడ్డి తెలిపారు.

## ఉపాధిహామీ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని బంజపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనులను బుధవారం ప్రారంభించడం జరిగిందని ఏపీఓ శివకుమార్ తెలిపారు. ఉపాధి లేక వలస వెళ్ళే వారికి ఉపాధి కల్పించేవిధంగా కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా ప్రజలకు ఉపాధి కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు బంజపల్లి పరిధిలోని భూముల్లో గుంతల తవ్వకం పనులు ప్రారంభించగా అట్టి పనులను ఏపీఓ శివకుమార్ పరిశీలించారు. ఆయన వెంట ఎఫ్ఏ, ఉపాధి సిబ్బంది తదితరులున్నారు.

## అంజనాద్రిలో కోటి రుద్ర పారాయణం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని బ్రాహ్మణపల్లి అంజనాద్రి క్షేత్రంలో బుధవారం మాధవానంద సరస్వతి స్వామీజీ ప్రత్యేక పర్యావేక్షణలో కోటి రుద్ర పారాయణం చేశారు. ఆలయ నిర్వాహకులు కిషోర్ కుమార్ మాట్లాడుతూ గత 7 నెలలుగా అంజనాద్రి క్షేత్రంలో పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ప్రత్యేక పర్యావేక్షణలో కోటి రుద్ర పారాయణ అంతర్గత భాగంలో 750 రుద్ర పారాయణాలు, 1050 శ్రీసూక్త పారాయణములు నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వేద పండితులు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** కాగజ్‌నగర్ మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ కోట ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైడే కార్యక్రమం నిర్వహించడం, వనమహోత్సవం కార్యక్రమంలో లక్ష్యం ప్రకారం మొక్కలు నాటడం, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, ఆసరా పింఛన్‌లు, తదితర అంశాలపై సమీక్షించారు. ఆయా అంశాలపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సమావేశంలో డాక్టర్లు నవీన్, కౌసర్ ఫాతిమా, ఎపిఒ చంద్రశేఖర్, హౌజింగ్ ఎఇ మహేష్, ఎన్ఎంలు, టిఎలు, క్షేత్రస్థాయి సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలి

**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని కాగజ్‌నగర్ ఎంపిడిఒ కోట ప్రసాద్ సూచించారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని లైన్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లను, మురికి కాలువలను శుభ్రంగా ఉంచుకోవాలని, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని అన్నారు. అనంతరం నర్సరీ మొక్కలను సందర్శించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం మారెపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల మార్కవుట్ ఇప్పించారు. మారెపల్లి నుండి లైన్‌గూడ వెళ్లే రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. మారెపల్లి ప్రాథమిక పాఠశాల భవనం సందర్శించి అసంపూర్తిగా ఉన్న విషయం ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఆయన వెంట ఎపిఒ చంద్రశేఖర్, హౌసింగ్ ఎఇ మహేష్, కార్యదర్శి రాజేశ్వర్ ఉన్నారు.

# పోక్సో చట్టం పై ప్రతి ఒక్కరికి అవగాహన



**ప్రజాపక్షం/నిర్మల్‌ప్రతినిధి:** పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.బుధవారం సాయంత్రం పట్టణంలోని దివ్య గార్డెన్స్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,బాలలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని,ప్రతి విద్యార్థికి పాఠశాల స్థాయిలోనే చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు.మండలాల వారీగా ఎంఈఓలు ప్రతి పాఠశాలలో ఈ చట్టంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.2012 లో అమలులోకి వచ్చిన ఈ చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు బాలలపై లైంగిక నేరాలకు పాల్పడినవారికి కఠిన శిక్షలు విధించే అవకాశం ఉందని చెప్పారు.అలాగే ఈ కేసుల విచారణ వేగంగా పూర్తయ్యేలా చట్టం రూపొందించబడిందని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న నిపుణుడు డేవిడ్ రాజు ఉపాధ్యాయులకు పోక్సో చట్టం,పాఠశాలల నిర్వహణ,వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు,అధికారులు పోక్సో చట్టంపై ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.పాల్గొన్న విద్యార్థులు,వక్తలకు,ఎన్‌సీసీ సభ్యులకు కలెక్టర్ జ్ఞాపికలు అందించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీవాణి,అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,డీఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక,జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు,ఎంఈఓలు,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరి దిగుబడి కోసం విరివిగా వాడుతున్న యూరియా

**ప్రజాపక్షం/నందిపేట్ :** జిల్లాలో ఈ ఖరీఫ్‌లో ఎక్కువ మొత్తంలో వరి పంటను నాటారు. వరి పంట ఎదగడం కోసం విరివిగా యూరియా వేస్తున్నారు. దీంతో రైతులుపంట పెరిగేందుకు తక్కువ మోతాదులో యూరియా వాడాలి. అందుకే యూరియా కొరత ఏర్పడుతుంది. దీనివల్ల భూమి సారవంతం తగ్గుతుంది. దిగుబడి రాను రాను తగ్గి నష్టాల పాలవుతామని రైతులు గుర్తుంచుకోవాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. చీడ, పీడల,తెగుళ్ళు ఆశించి నష్టాలు ఎదుర్కొంటామని వారంటున్నారు. యూరియా తీపి ఎక్కువగా ఉండడం వల్ల వరికి మొగి పురుగు తెగుళ్లు ఆశించి వాటి నివారణకు వేలాది రూపాయలు పెట్టి పురుగు మందులు పిచికారి చేస్తున్నామని రైతులు గుర్తించాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ పరిస్తితులు చల్లగా ఉండడం, నీరు సమృద్ధిగా ఉండడం వల్ల పైరు ఎదగడం లేదు. రైతులు తడి పొడి పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈ యాసంగిలో లాభాలు సంపాదించవచ్చని రైతులు అనుకుంటున్న పంట దిగుబడి తగ్గవచ్చని ఆందోళన చెందుతున్నారు. తక్కువ మొత్తంలో యూరియా వాడాలని రైతులు గుర్తించాలని అధికారులు కోరారు.

## ధర్పల్లి ఎస్సైని కలిసిన బిజెపి నాయకులు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** ధర్పల్లి పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై కళ్యాణిని మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాబోవు సంస్థాగత ఎన్నికల్లో అన్ని పార్టీల నాయకుల సమన్వయంతో ఉండాలని ఎలాంటి గొడవలు జరగకుండా ఉండాలని అందుకు మండల కార్యకర్తలకు సూచించాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి సంఘటనలు, గొడవలు జరిగిన వారే బాధ్యులు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జిర్ర మహిపాల్‌యాదవ్,కర్క గంగారెడ్డి, దాసు, సుమన్, పెద్దబాల్‌రెడ్డి, సేవలాల్, రాజశేఖర్, నరేష్ పాల్గొన్నారు.

## గురు పూర్ణిమకు ఏర్పాట్లు



**ప్రజాపక్షం / నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో గురువారం జరగనున్న గురుపూర్ణిమ ఉత్సవాలకు కేదారేశ్వర ఆశ్రమం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఆశ్రమంలో సాయిబాబా ఆలయాన్ని అలంకరిస్తున్నారు. అలాగే తల్వేద తదితర గ్రామాల్లో ఆశ్రమానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహక కమిటి ప్రయత్నాలు చేస్తుంది. రంగు రంగు దీపాలతో, టెంట్లు, అన్నదాన సత్రం ఏర్పాటు చేస్తుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ కార్యక్రమాలు కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. సాయిబాబా ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయి.

## బాధితలకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే లో పాల్గొన్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల,ఈ సందర్భంగా బైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 17 మంది అర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి,ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు.ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి,బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు.

**కుటుంబ వివాదాల పరిష్కారంలో షీ టీం పాత్ర**

ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు.కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది.ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా,బైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు.

**పెండింగ్ ఫిర్యాదులపై సమీక్ష..**

ఈ సందర్భంగా గతంలో గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి,ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



**ప్రజాపక్షం/బోధన్:** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా ప్రాంగణంలో కార్మికులతో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర కార్మిక సంఘ నాయకులు టియుసిఐ రాష్ట్ర నాయకులు మల్లేష్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వరదయ్య, ఏఐటియు జిల్లా నాయకులు చక్రపాణి, ఐఎఫ్టియు నాయకులు పోశెట్టి లు మాట్లాడుతూ... మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో జరగబోయే జరగబోయే భారీ ఉద్యమాలకు ఈ సమ్మె నాంది లాంటిదని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశంలోని కార్మిక వర్గ ప్రయోజనాల కోసం పని చేయడం లేదని బడా పెట్టుబడిదారుల కార్పొరేట్ శక్తుల కొమ్ముకాసే ప్రభుత్వమని దుయ్యబట్టారు. దేశంలో రోజురోజుకు నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతుందని వారికిచ్చిన మాట ప్రకారం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వకపోనూ ఖాళీలను రిటైర్డ్ ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈపీఎఫ్ కార్మికులకు 9వేల పెన్షన్ ఇవ్వాలని, పెన్షన్ రాని కార్మికులకు ఆరువేల రూపాయాల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలో పెట్టుబడులు రాకపోవడానికి కారణం కార్మికులు కారని ఆదాని, అంబాని లు, పాలకులే కారణమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా దేశ ప్రజల ప్రయోజనాల కోసం, దేశ రైతాంగం కోసం వర్గ ప్రయోజనాల కోసం పని చేయాలని లేకపోతే బిజెపి ప్రభుత్వం కార్మిక ప్రజల ఆగ్రహానికి గురిగాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ నాయకులు ఈర్షద్, నాగమణి, మక్కయ్య, రెహానా బేగం, గంగామణి, మరిగమ్మ, ఆంజాద్, సలీం, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సీతారాం, సిఐటియు నాయకులు ఏషాల గంగాధర్, జంగం గంగాధర్, సాగర్, ఐఎఫ్టియు నాయకులు లక్ష్మ ణ్ గౌడ్, సురేష్, సాయిలు గౌడ్, ఎస్బిఐ నాయకులు నాగరాజు కార్మికులు పాల్గొన్నారు.

## ఎస్‌ఐ ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్‌ఐ రాము ను బుధవారం మోర్తాడ్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ ధర్మాజీ గోపి, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మోర్తాడ్ పట్టణ అధ్యక్షుడు పుప్పల అశోక్, చౌక్కా గంగారెడ్డి, జక్కం అశోక్, భూపతి, కడపటి రాజేశ్వర్, గుర్రం అశోక్, జక్కం అశోక్ పాల్గొన్నారు.

## నూతన అధికారులకు సన్మానం

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని నూతన అధికారులుగ నియామకమై బాధ్యతలు తీసుకున్న మండల అభివృద్ధి అధికారి ఎస్.శేఖర్,ఎస్సై ఇమ్రాన్ ఖాన్,లని పలువురు మండల నాయకులు సన్మానించి పూల బోకే శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మండల లైవ్ నాయకులుపాల్గొన్నారు.

## దళిత వాడలో మంత్రి దనసరి సీతక్క జన్మదిన వేడుకలు..

**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ పట్టణంలో గాంధీనగర్ కాలనీలో రాష్ట్ర మంత్రి (అనసూయ) సీతక్క 54వ జన్మదినోత్సవ వేడుక చేసిన కాంగ్రెస్ మహిళ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు గంగాభవాని.ఈ సందర్భంగా తను మాట్లాడుతూ తెలంగాణ మహిళా మంత్రులలో చెరగని ముద్ర వేసుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీతక్క,రాష్ట్రంలో మహిళల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని,గిరిజన ఆడబిడ్డగా రాష్ట్రంలో ప్రతి పల్లెకు వెళ్ళి ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవడంలో ముందుంటారని,వారికి అవసరమైన సహాయాన్ని చేస్తరని,తెలంగాణలో గుర్తింపు కలిగిన ఎమ్మెల్యేలలో తాను ఒకరిగా ఉన్నారని,మంత్రి పదవి వన్నె తెచ్చిన మహిళ నేత సీతక్క ఉన్నారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ పరిమలా,మహిళా మండల అధ్యక్షురాలు శారద,మండల ఉపాధ్యక్షురాలు నస్రత్ ఫాతిమా,మహిళా నాయకులు కమల,గోదావరి,అమృత,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## క్షత్రియ మహిళా మండలి సభ్యుల బోనాలతో ఊరేగింపు

**ప్రజాపక్షం / ఆర్మూర్ :** అమ్మ... తల్లి మమ్ములను క్షత్రియ కులస్తులను ఆయురారోగ్యాలతో ఉంచాలని, పిల్లా పాపలతో సల్లంగుంచాలని కోరుతు క్షత్రియ మహిళా మండలి సభ్యులు పెద్ద సంఖ్యలో బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం చిన్నబజార్‌లోగల లక్ష్మీనారాయణ మందిరం నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. లక్ష్మీనారాయణ మందిరం నుంచి గోల్ బంగ్లా మీదుగా ముత్యాలమ్మ ఆలయం వరకు ఊరేగించి గోదావరి జలాలతో అభిషేకం చేశారు. తిరిగి బోనాలతో నల్ల పోచమ్మ వరకు కాలినడకన వెళ్లి జలాభిషేకం చేశారు. 11 పళ్యాలలో నల్లపోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు రెడ్డి ప్రకాష్, ఉపాధ్యక్షుడు జెస్సు ఆనంద్, కోశాధికారి వైద్య సంజయ్, సభ్యులు సాత్ పుతే శ్రీనివాస్, బొబిడే గంగాకిషన్, యువజన సమాజ్ అద్యక్ష కార్యదర్శులు సాత్ పుతే సంతోష్, దుమాని నీరజ్, మహిళా మండలి సభ్యులు సంగీత ఖాందేశ్, గటడి స్వాతి, డిజె సులోచన, పాల్గొన్నారు.

## కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**ప్రజాపక్షం/బోధన్:** ప్రభుత్వాలు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని సిఐటియు జిల్లా నాయకులు నన్నేసాబ్ కోరారు. దేశవ్యాప్త సమ్మె కార్యక్రమంలో భాగంగా బుధవారం వర్ని మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అవలంభిస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నెలకు 9000 పెన్షన్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.